
దీర్ఘ కవిత



# బాలగోపాల్

## అతడి అసలు పేరు స్వేచ్ఛ

చెరుకుమల్లి సింగా

# బాలగోపాల్

అతడి అసలు పేరు స్వేచ్ఛ

దీర్ఘ కవిత

**చెరుకుమల్లి సింగా**

# బాలగోపాల్

అతడి అసలు పేరు స్వేచ్ఛ

దీర్ఘ కవిత

**చెరుకుమల్లి సింగా**



ప్రచురణ

**వివేకా స్వచ్ఛంద సంస్థ**

కార్యదర్శి: యార్లగడ్డ నాగరాజు

తెనాలి

**బాలగోపాల్**
అతని అసలు పేరు స్వేచ్ఛ

---

**చెరుకుమల్లి సింగా**

మొదటి ముద్రణ : 7, అక్టోబర్ 2012

డిజైన్, బుక్‌మేకింగ్ : జుగాష్‌విలి

డి.టి.పి. : క్రియా డిజైన్స్
ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్

**ప్రతులకు**
చెరుకుమల్లి సింగా
కవిరాజు పార్క్‌రోడ్, నందులపేట
తెనాలి - 522 201
సెల్: 9177174389

అన్ని పుస్తక కేంద్రాలు

**వెల : రూ॥ 10/-**

# ఓ పరామర్శ

స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో నక్సలబరీ ఉద్యమం ఒక మైలురాయి. స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత అని చరిత్రను విభజించినట్లుగా నక్సల్‌బరీకి ముందు ఆ తర్వాత అని చరిత్రను అధ్యయనం చేయాల్సిన అనివార్యతను ఈ ఉద్యమం కల్పించింది. సమస్త రంగాలనూ ఒక కుదుపు కుదిపింది. అప్పటి వరకూ పాలకవర్గ మేధావి వర్గానికి ప్రత్యామ్నాయ మేధావి వర్గంగా చలామణి అవుతున్న వాళ్ళను పక్కకు తోసివేసి సమరశీల మేధావి వర్గాన్ని సృష్టించింది. ఆ సమరశీల మేధావి వర్గంలో అగ్రగణ్యుడు డా॥కె.బాలగోపాల్.

తాము నమ్ముతున్న భావజాలాన్ని, సిద్ధాంతాన్ని మతం స్థాయికి తీసుకువెళ్ళి వాటిమీద ఈగను కూడా వాలనివ్వకుండా గదలూ, గాండీవాలూ పట్టుకొని కాపలా కాస్తున్న ఇతర మేధావులలాంటి వాడు కాదు బాలగోపాల్. సామాజిక ఆచరణ ద్వారా తను నమ్మిన సిద్ధాంతం, భావజాలంలోని పరిమితులను, లోపాలను అవగాహన చేసుకున్నవాడు బాలగోపాల్.

నక్సల్‌బరీ తర్వాత వచ్చిన అన్నిరకాల అస్తిత్వ ఉద్యమాలనూ ఆకలింపు చేసుకుని, అవి ముందుకు తెచ్చిన ఆకాంక్షలనూ, ప్రజాస్వామిక విలువలనూ తన భావజాలంలో భాగంగా చేసుకుని పాత అవగాహనను ఎప్పటికప్పుడు విస్తృత పరుచుకుంటూ వాటిని సామాజిక ఆచరణలోకి తెచ్చి మానవహక్కుల ఉద్యమంలో భాగంగా చేసిన వాడు బాలగోపాల్. సిద్ధాంత ఛాందసత్వం లేకుండా అన్నిరకాల ప్రజాస్వామిక విలువలకూ మనసు ద్వారాలను చివరి వరకూ తెరచి వుంచిన అసామాన్య సామాన్యుడు బాలగోపాల్.

బాలగోపాల్ మరణవార్త తెలిసిన వెంటనే మిత్రుడు చెరుకుమల్లి సింగా ఈ దీర్ఘ కవిత రాశాడు. సింగా తెనాలి సి.పి.ఐ పార్టీ ప్రముఖ నాయకుడు. మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసారు. సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీలకు చెందినవాళ్ళు మహా అయితే ఒక సంతాపప్రకటనకు పరిమితమౌతారు తప్ప బాలగోపాల్ మరణానికి స్పందించి కవిత రాయడం ఊహించరాని విషయం. ఊహించలేని విషయాన్ని వాస్తవం చేసి చూపించాడు మా 'సింగా'.

పార్టీ ఛాందస సంకెళ్ళలో ఇమిడే మనిషికాదు సింగా. తెనాలి పట్టణంలో జరిగే కార్మికుల, గుడిసె వాసుల పోరాటాల్లో ముందుంటాడు. తెనాలిలో జరిగే ప్రతి సాహితీ, కళా కార్యక్రమంలోనూ నిర్వాహక భాగస్వామి సింగా. బాలబాలికల విద్యాహక్కులు, ప్రస్తుత విద్యావిధానంలో వాళ్ళపై అమలవుతున్న హింస గురించి 'సిరి' అనే డాక్యుమెంటరీని కూడా అప్పుచేసి మరీ నిర్మించాడు. పరిషత్తు నాటకాలు, పౌరాణిక నాటకాలు,

బొల్లిముంత స్మారక కళాపరిషత్. అరసం యిలా అన్నిటిలోనూ చేతులూ కాళ్ళు దూరుస్తాడు. అవకాశాలు వుండి కూడా డబ్బులు సంపాదించుకునే తెలివి తేటలు లేనివాడు.

ఒక రోజు ఏదో పని మీద వాళ్ళింటి కెళ్ళాను. సగం పూరిల్లూ, సగం రేకుల షెడ్డూ. ముగ్గుబుట్టలాంటి తలతో వాళ్ళ అమ్మ. చిన్నతనంలోనే నాన్న చనిపోతే రెక్కల కష్టంతో పెంచి పెద్దచేసిన తల్లి. నేవెళ్ళేటప్పటికి సింగా యింట్లో లేడు. 'సిరి' డాక్యుమెంటరీ రీ రికార్డింగ్ పనులమీద హైదరాబాద్ వెళ్ళాడు.

"అయ్యా, మా అబ్బాయికి నువ్వయినా చెప్పరాదా, ఎయ్యో మీటింగులనీ, సినిమాలనీ(డాక్యుమెంటరీ) డబ్బులు తగలేస్తున్నాడు. అప్పులు చేస్తున్నాడు. పనీపాటా లేకుండా తిరుగుతున్నాడు" అంది వాళ్ళమ్మ.

"పనీ పాటా లేకపోవడ మేంటమ్మా. చాలా పనులు చేస్తున్నాడు. కాకపోతే డబ్బులు వచ్చే పనులకావు. డబ్బులు రాని పనులు చేసేవాడెవడైనా వాడికి తోచింది చేస్తాడు తప్ప ఇంకొకడు చెబితే వినడమ్మా" అని చెప్పి వచ్చేశాను.

డబ్బులు రాని పనులు చెయ్యడంలో క్షణం కూడా తీరికలేకుండా ఉండేవాళ్ళలో బాలగోపాల్‌ను మించిన వాళ్ళు ఆంధ్రదేశంలో ఇంకెవరూలేరు. అందుకనే బాలగోపాల్ అంటే సింగాకు అంత అభిమానం. అందుకే బాలగోపాల్ మరణానికి స్పందించి ఈ దీర్ఘ కవిత రాయటం.

"శాస్త్రాలు సాధనతో శోధించి
మానవ హక్కుల్ని
దివిటీగా వెలిగించిన
హక్కుల ఖడ్గసృష్టి అతడు

......................

అతడు దేశమంతా నిండిన ఎర్రసింధూరం
భూమిచుట్టూ అల్లుకున్న ఓ నిరసన నల్లవస్త్రం
సూర్యుడిని మింగిన ఓ మేఘం
ఆ సాయంత్రం కరిగి కన్నీరైంది"

మేఘమే కాదు. మా సింగా కూడా కరిగి కన్నీరు అవ్వబట్టే ఈ కవిత రాశాడు. పార్టీల, సిద్ధాంతాల సంకెళ్ళలో మానవ స్పందనలు ఇంకా కోల్పోని ఓ వ్యక్తి ఒక మనిషికి అర్పించిన నివాళి ఈ కవిత.

**జి.యస్.నాగేశ్వరరావు**
న్యాయవాది
బాలగోపాల్ మెమోరియల్ చాంబర్ ఆఫ్ లా, తెనాలి



నమ్మిన సిద్ధాంతం కోసం
నిరంతరం ప్రవాహమై సాగిన
విశ్వమానవుడు అతడు
కానీ అతడిప్పుడు లేడు

అతడి సంభాషణా ప్రవాహం అలాగేవుంది
అతడు నినదించిన నినాదమూ అలాగేవుంది
కాశ్మీరు నుండి కన్యాకుమారి దాకా ఆ నేలపై
హక్కుల జెండా తానై తిరుగాడిన
అతడి పాదముద్రలు అలాగే వున్నాయి
కానీ అతడిప్పుడు లేడు.

భూమికోసం భూమిమీద మనిషి కోసం
అడవికోసం అడవిలోని ఆదివాసీ కోసం
వేకువ వేగు చుక్కలా
కదిలే అతడు నిరంతర సత్యాన్వేషి, ప్రయాణికుడు
కానీ అతడిప్పుడు లేడు

రేయీ పగలు, వానా ఎండా
కొండాకోనా, చెట్టు పుట్టా
వాగూ వంకా, గుహల్లో గూడుల్లో
అలసటెరుగని ప్రయాణికుడు
అతడు నిరంతర పాదచారి
అతడు విశ్వంభరుడు
కానీ అతడిప్పుడు లేడు.

నిరంతర సాధనతో శాస్త్రాల్ని శోధించి
మానవ హక్కుల్ని
దివిటీగా వెలిగించిన
హక్కుల ఖడ్గసృష్టి అతడు
మనిషి కోసం
మామూలు మనిషి కోసం
జీవితమంతా మట్టిలోనే మగ్గిపోయిన మనిషి కోసం
విశ్వమంత గళమెత్తిన
విలువలున్న నెలువెత్తు ఖడ్గమతడు
కానీ అతడిప్పుడు లేడు

ఉన్నట్టుండి మనుషులు మాయమయ్యే రాజ్యంలో
కారణాలకోసం శోధించినవాడు
నిజనిర్ధారణ చేసి
లోకానికి లోగుట్టును
విప్పిచెప్పిన నిజాన్వేషి



కన్నతల్లుల గర్భశోకాన్ని
చూపుడు వేళ్ళుగా ఎక్కుపెట్టినవాడతడు
కానీ అతడిప్పుడు లేడు

అతడి రూపం చలిరాత్రి చందమామ
అతడి వదనం ఉదయపువేళ సూర్యుడు
అతడి స్వరం పెనుతుఫానుల ఉగ్రగానం
అతడి నవ్వు వర్షాకాలపు అడవి
అతడి చరిత్ర ప్రపంచ చరిత్ర
అతడి బతుకు ప్రజల బతుకు
అతడు ప్రవక్త
అతడు ప్రచారకుడు
అతడు నిరంతర సంచారి
అందుకే అతడు విశ్వమానవుడు
కానీ అతడిప్పుడు లేడు

కాశ్మీరు కుంకుమ వనాల
పరిమళాల చాటున దాగిన
నెత్తుటి చిత్తడి
ఊపిరుల ఉనికిని చాటినవాడు
ఈశాన్యంపై ముసురుకున్న
చిక్కటి చీకటి ముసుగుని చింపేసి
లోకబహిర్గతం చేసిన
విపుల వెలుగుల మాంత్రికుడు అతడు
కానీ అతడిప్పుడు లేడు

గుజరాత్ బొంబాయి సూరత్‌లో
తెగిపడిన మనవ శిరస్సులలో
చెదిరిపోయిన మానాల్లో
కాషాయపు క్రౌర్యాన్ని
నిర్భయంగా ప్రకటించి
హిందూ రాజ్య ఫాసిజం
గుట్టు విప్పినవాడు అతడు
కానీ అతడిప్పుడు లేడు

కారంచేడు నీరుకొండ
చుండూరు వేంపెంట ఏదైతేనేం
అగ్రకుల దురహంకారం
చిదిమేసిన ప్రతి వెలివాడనూ
చరిత్రగా మలచినవాడు
దళిత అస్తిత్వానికి దిక్సూచిగా మారినవాడు
కానీ అతడిప్పుడు లేడు

ఉరిశిక్షల రద్దుకోసం ఉద్యమించి
నాగరిక ప్రపంచం కళ్ళు తెరిపించిన
మానవీయ క్రాంతికిరణమతడు
వాకపల్లి పల్నాడు నల్లమల ఎక్కడైతేనేం
ఉక్కునాడాల దుర్మార్గాన్ని
అక్షరీకరించిన కలం యోధుడు అతడు
కానీ అతడిప్పుడు లేడు



సెజ్‌ల పేరుతో భూములు
సముద్రంలో గ్యాస్
జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం
ఒక్కటేమిటి
పచ్చని పల్లెలన్నీ కాంక్రీటు
వనాలుగా మారుస్తున్న
ఈ రాజకీయ నాయకుల
కబంధ హస్తాలనుండి
మనల్ని మనమే కాపాడుకోవాలంటూ
సామాన్యమానవుడిని వెలుగు రవ్వగా మలచిన
అగ్నిజ్వాల అతడు
కానీ అతడిప్పుడు లేడు

పావురాల్ని హత్య చేసిందెవరో
అడవికి తెలుసు
కన్నీరు కార్చే చిటారుకొమ్మ
చిరుగాలికి తెలుసు
వీరుని కంటిలో గుచ్చుకున్న
తుపాకి గుండు నిజమేమిటో చెబుతోంది
రాజ్యం అది అబద్ధం అంటుంది
రాజ్యం వేసే ముడులన్నీ
అతడు విప్పుతాడు
కానీ అతడిప్పుడు లేడు

జాతీయ అంతర్జాతీయ సదస్సులు జరుగుతుంటాయి
రక్తాన్ని తాగే తోడేళ్ళన్నీ వేదిక నలంకరిస్తాయి.
శాంతిగురించీ స్వేచ్ఛ గురించీ అవి చర్చిస్తాయి
సభ ముగుస్తుంది
అసలు సభ ఇప్పుడే మొదలవుతోంది
జరుగుతున్న జరపబోయే
యుద్ధ వ్యూహాల గురించి మాట్లాడుకుంటాయి
ఆయుధ వ్యాపార లావాదేవీలన్నీ సాగుతుంటాయి
తోడేళ్ళ ఈ బహుముఖ విన్యాసాలను
అంచనా కట్టగలిగే జ్ఞానబోధి అతడు
కానీ అతడిప్పుడు లేడు

ఎవరో చేసిన త్యాగాలు
తమకు అన్వయించుకునేవారికి
అతడు ఓ కొరడా దెబ్బ
ఓ సిద్ధాంతాన్ని నమ్మినప్పుడు
దానికి ప్రవక్తవో
ప్రచారకుడవో అయినప్పుడు
నువ్విలానే బతకాలని
నువ్విలానే నడవాలని
సమస్తాన్ని త్యజించి
ఎలా బతకాలో
ఎలా నడవాలో



అలాగే బతికి ఆచరణకు
ప్రత్యామ్నాయం అయినవాడు
నిజాయితీ అగ్నిలో స్నానించిన
నిత్య అగ్నిహోత్రుడు అతడు
స్వేచ్ఛాకాశాన ఉదయించే
సూర్యబింబం అతడు
కానీ అతడిప్పుడు లేడు

ఓ పెనుగాలి వీచినా
ఓ చివురుటాకు రాలినా
ఓ పల్లె తల్లడిల్లినా
అది అతడి ఓ తక్షణ చిరునామా
రాలిపడిన ప్రతి ఆకుమీద
ఎర్రగా మెరిసే వెన్నెల సంతకమతడు
కానీ అతడిప్పుడు లేడు

అతడు సూర్యుడికి చెందినవాడు
అతడు పచ్చిక మైదానాలకు చెందినవాడు
అతడు తుఫాను గాలులకు చెందినవాడు
అతడు భగ్గుమనే కాగడాలకు చెందినవాడు
రాక్షస రాజ్యానికి వ్యతిరేకంగా
ఒకే ఒక్క గళాన్ని ఎక్కుపెట్టిన వాడు
కానీ అతడిప్పుడు లేడు

అతడికి నిష్క్రమణ వుంటుందంటే
చిరుగాలి సైతం కచ్చితంగా తిరస్కరిస్తుంది
చిగురిస్తున్న చివురుటాకు నివ్వెరబోతుంది
విచ్చుకోబోతున్న మొగ్గ విలపిస్తుంది
పారుతున్న యేరు ఘనీభవిస్తుంది
అడవిలోని వెన్నెల కన్నీరుమున్నీరవుతుంది
అతడలా నిశ్శబ్ధంగా వెళ్ళిపోయాడంటే
దుఃఖం కూడా నమ్మలేకపోతుంది

అతడు దేశమంతా నిండిన ఎర్రసింధూరం
భూమి చుట్టూ అల్లుకున్న ఓ నిరసన నల్లవస్త్రం
సూర్యుడిని మింగిన ఓ మేఘం
ఆ సాయంత్రం కరిగి కన్నీరైంది

బాలగోపాల్ మరణించాడని ఎవరన్నారు?

అతడు మన మధ్యేవున్నాడు
విశ్వమానవుడు కదా
విశ్వమంతా ఆవరించివున్నాడు
కుళ్ళిన వ్యవస్థను అగ్నిలో శుభ్రపరుస్తూ
బోధివృక్షం క్రింద జ్ఞానబోధ చేస్తున్నాడతడు
మానవతకు మణిహారం
కడిగిన ముత్యంలా
కళ్ళముందు కదలాడుతున్నాడు

అతడి ఆచరణలో
హక్కుల భాషను నేర్చుకున్న
పల్లెలు, మైదానాలు అతడ్ని తలుచుకుని
పునరుజ్జీవమవుతూనే ఉన్నాయి
తమగొంతుల్లో, పాటల్లో, ధిక్కార నినాదాలలో
అతడ్ని ఎత్తిపడుతూనే ఉన్నాయి
విశ్వమానవుడి విశ్వరూపం
చరిత్ర అంతా అలుముకుంది
అతని చరిత్ర విశ్వజనితం



బాలగోపాల్ మరణించాడని ఎవరన్నారు?


అతడొస్తాడు
అతడు ఏకవచనం కాదు
అతడు బహువచనం
అతడు సమూహం
అతడు నడుస్తున్న చరిత్ర
అతడు హక్కుల దార్శనికుడు
అతడు సామాన్యుల మహోపాధ్యాయుడు
అతడి అసలు పేరు స్వేచ్ఛ

అతడొస్తాడు
అమానుషమే అంతటా ఏకైక విలువగా
చెలామణి అవుతున్న వేళ

ఏ ఒక్క గొంతూ యిదేమిటని ప్రశ్నించలేక
గడ్డకట్టుకుపోయిన వేళ
అతడొస్తాడు

సమూహ స్వరమై అతడొస్తాడు
సమరశీల స్వరమై అతడొస్తాడు
ఉదయించే సూర్యునివలె
అతడు నిరంతరం
ప్రతి ధ్వనిస్తుంటాడు
ప్రతిఫలిస్తుంటాడు

balagopal | athadi asalu peru swechha | cherukumalli singa




స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో నక్సలబరీ ఉద్యమం ఒక మైలురాయి. స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత అని చరిత్రను విభజించినట్లుగా నక్సల్‌బరీకి ముందు ఆ తర్వాత అని చరిత్రను అధ్యయనం చేయాల్సిన అనివార్యతను ఈ ఉద్యమం కల్పించింది. సమస్త రంగాలనూ ఒక కుదుపు కుదిపింది. అప్పటి వరకూ పాలకవర్గ మేధావి వర్గానికి ప్రత్యామ్నాయ మేధావి వర్గంగా చలామణి అవుతున్న వాళ్ళను పక్కకు తోసివేసి సమరశీలమేధావి వర్గాన్ని సృష్టించింది. ఆ సమరశీలమేధావి వర్గంలో అగ్రగణ్యుడు డా॥కె. బాలగోపాల్.

నక్సల్‌బరీ తర్వాత వచ్చిన అన్నిరకాలఅస్తిత్వ ఉద్మమాలనూ ఆకలింపు చేసుకుని, అవి ముందుకు తెచ్చిన ఆకాంక్షలనూ, ప్రజాస్వామిక విలువలనూ తన భావజాలంలో భాగంగా చేసుకుని పాత అవగాహనను ఎప్పటికప్పుడు విస్తృత పరుచుకుంటూ వాటిని సామాజిక ఆచరణలోకి తెచ్చి మానవహక్కులఉద్యమంలో భాగంగా చేసిన వాడు బాలగోపాల్. సిద్ధాంత ఛాందసత్వం లేకుండా అన్ని రకాల ప్రజాస్వామిక విలువలకూ మనసు ద్వారాలను చివరి వరకూ తెరచి వుంచిన అసామాన్య సామాన్యుడు బాలగోపాల్.

...

పార్టీల, సిద్ధాంతాలసంకెళ్ళలో మానవ స్పందనలు ఇంకా కోల్పోని ఓ వ్యక్తి ఒక మనిషికి అర్పించిన నివాళి ఈ కవిత.

-జి. యస్. నాగేశ్వరరావు